# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శనివారం 20, జూన్ 2026





## ఓటరు ప్రత్యేక సమగ్ర కార్యక్రమాన్ని

# పారదర్శకంగా నిర్వహించాలి

* రాష్ట్ర ముఖ్య ఎలక్టోరల్ అధికారి సుదర్శన్‌రెడ్డి

**ఆసిఫాబాద్, జూన్ 19, ప్రభాతవార్త**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ఏలాంటి పొరపాట్లు లేకుండా స్పష్టంగా, పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్య ఎలక్టోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ లోని రాష్ట్ర ఎలక్టోరల్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎఈఆర్ఓ లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి ఎలక్టోరల్ అధికారి మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీ నుండి జూలై 24వ తేదీ వరకు చేపట్టే ఓటర్ ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్లకు శిక్షణ ప్రక్రియ పూర్తి చేయాలని, ఎన్యుమరేషన్ ఫారం నింపే విధానాన్ని బూత్ స్థాయి అధికారులకు వివరించాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటికి వెళ్లేటప్పుడు గుర్తింపు కార్డులు ధరించాలని, ప్రతిరోజు సేకరించిన ఎన్యుమరేషన్ ఫారాలలోని వివరాలను అదే రోజు యాప్ లో నమోదు చేయాలని తెలిపారు. కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఈఆర్ఓలు, ఎఈఆర్ఓ లు ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో ప్రతి రోజు క్షేత్రస్థాయిలో పర్యటించి బూత్ స్థాయి అధికారులకు సూచనలు ఇవ్వాలని తెలిపారు. ప్రక్రియ నిర్వహణపై ఎలక్ట్రానిక్ మీడియా సాధనాలలో విస్తృత ప్రచారం నిర్వహించాలని, ఎన్యుమరేషన్ ఫారాలు ఇతర మెటీరియల్ను బూత్ స్థాయి అధికారులకు అందించాలని, ప్రక్రియ ప్రశాంతంగా చేపట్టిన అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ కె.హరిత, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 22వ తేదీన గ్రామ పటేళ్లు, బూత్ సాయి అధికారులు, వాలంటీర్లతో వర్చువల్ సమావేశాలు నిర్వహించి ప్రత్యేక హోటరు సమగ్ర సవరణపై వివరించడం మిగతా 2లో..




## ఎరువుల దుకాణాలపై

# ఆకస్మిక తనిఖీలు

● స్టాక్ గోల్ మాల్ చేస్తే లైసెన్సులు రద్దు.. లింక్ ప్రొడక్ట్స్ విక్రయిస్తే కఠిన చర్యలు

● డివిజన్ వ్యాప్తంగా 2,635 మంది రైతుల బుకింగ్‌ఖరైతులకు భరోసా... డీలర్లకు హెచ్చరిక



**పెంచికల్ పేట్, జూన్ 19, ప్రభాతవార్త**

యూరియా యాప్‌లో రైతన్నకు యాతన అనే శీర్షికన గురువారం ప్రచురితమైన వార్త కథనానికి మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ స్పందించారు. శుక్రవారం పెంచికల్ పేట్ మండలంలోని పలు ఎరువుల దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల నిల్వాలు, విక్రయాల నమోదు, యాప్ ద్వారా బుకింగ్ ప్రక్రియను పరిశీలించి డీలర్లకు పలు సూచనలు చేశారు. రైతులు దూరప్రాంతాల్లోని కేంద్రాల వద్ద బుకింగ్ చేసుకోవడం వల్ల ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని, తమకు సమీపంలో ఉన్న ఎరువుల విక్రయ కేంద్రాల్లోనే యూరియా బుకింగ్ చేసుకుని ఎరువులను పొందాలని సూచించారు. ప్రస్తుతం మండలంలో ఎరువుల సరఫరా సజావుగా కొనసాగుతోందని చెప్పారు. ఇప్పటివరకు 2,635 మంది రైతులు యాప్ ద్వారా ఎరువులు బుకింగ్ చేసుకున్నారని తెలిపారు. యాప్ వినియోగంలో ఏవైనా సందేహాలు లేదా సాంకేతిక సమస్యలు ఎదురైతే సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలని రైతులకు సూచించారు. ఎరువుల డీలర్లు తమ వద్దకు కొత్త స్టాకు వచ్చిన వెంటనే యాప్ లో నమోదు చేయాలని ఆదేశించారు. స్టాక్ నమోదు చేయకుండా విక్రయాలు జరిపినట్లు తేలితే లైసెన్సు సస్పెన్షన్‌తో పాటు శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు బుకింగ్ చేసుకున్న ఎరువులను తప్పనిసరిగా అందజేయాలని ఎలాంటి మిగతా 2లో..

# మున్సిపల్ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలి

✪ అదనపు కలెక్టర్ యువరాజ్ మార్మట్



**కాగజ్‌నగర్ రూరల్, జూన్ 19, ప్రభాతవార్త :**

మున్సిపల్ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మార్మట్ అన్నారు శుక్రవారం కాగజ్‌నగర్ మున్సిపాలిటీని సందర్శించి పట్టణ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశమైన ఆయన పట్టణంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, పారిశుధ్య నిర్వహణ, పన్నుల వసూళ్లు, ప్రజా సేవల అమలు తీరును సమీక్షించి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు .మున్సిపల్ చైర్‌పర్సన్ షహీన్ సుల్తానా, వార్డు కౌన్సిలర్లతో సమావేశమై మిగతా 2లో..

## బంగారు గని సింగరేణిని

# అప్పుల కుప్పగా మార్చారు

* సింగరేణి భరోసా యాత్రలో తీవ్ర ఉద్రిక్తత.. బీజేపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల అరెస్ట్
* 40 లక్షల టన్నుల బొగ్గు మాయంపై నిజనిర్ధారణ కమిటీ ఎందుకు వేయడం లేదు?
* కాంగ్రెస్ అక్రమాలను కప్పిపుచ్చుకోవడానికే నిర్బంధాలు
* బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

– నస్పూర్, జూన్ 19, ప్రభాతవార్త



2లో..

## బంగారు గని సింగరేణిని

# అప్పుల కుప్పగా మార్చారు

**నస్పూర్, జూన్ 19, ప్రభాతవార్త**



బంగారు గని లాంటి సింగరేణిని అప్పుల కుప్పగా మార్చారని, గత పదేళ్లు బీఆర్ఎస్ దోచుకుంటే, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అదే బాటలో పయనిస్తోందని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. సింగరేణిలో జరుగుతున్న అవకతవకలపై చేపట్టిన జసింగరేణి భరోసాచ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ మైన్ (ఓసీపీ) పరిశీలనకు వెళ్లిన బీజేపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులకు, బీజేపీ నేతలకు మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట జరిగి ఉద్రిక్తత చోటుచేసుకుంది. అనంతరం పోలీసులు ప్రజాప్రతినిధులను బలవంతంగా అరెస్టు చేయడంతో బీజేపీ శ్రేణులు పోలీస్ వాహనాలను అడ్డుకొని నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ సింగరేణిలో 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు మాయమైందని ఆరోపణలు వచ్చినా ప్రభుత్వం ఎందుకు నిజనిర్ధారణ కమిటీ వేయడం లేదని ప్రశ్నించారు. ఓపెన్ కాస్ట్ మైన్ పనులను తమకు నచ్చిన కాంట్రాక్టర్లకు అప్పగించి మోసాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ అక్రమాలపై నిగ్గుతేల్చాలని కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం ఇవ్వడం లేదన్నారు. సీఎం సింగరేణిని ఒక బంగారు బాతులా చూస్తూ నిర్బంధ రాజ్యం నడిపిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అక్రమాలను కప్పిపుచ్చుకోవడానికే క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చిన తమను అడ్డుకున్నారని ధ్వజమెత్తారు. మూడు రోజుల క్రితమే అనుమతి కొరకు దరఖాస్తు చేసినా పోలీసులు స్పందించలేదని, కార్మికులను కలిసి వారి సమస్యలు తెలుసుకునే అవకాశం కూడా ఇవ్వలేదని మహేశ్వర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణిలో జరుగుతున్న అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వాన్ని అసెంబ్లీలో నిలదీస్తామని, దోచుకున్న సొమ్మును కక్కించే వరకు బీజేపీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. పెద్ద సంఖ్యలో హాజరైన బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేస్తూ అరెస్టులకు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎమ్మెల్యేలు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి, పాల్వాయి హరీశ్ బాబు, పైడి రాకేష్ రెడ్డి, రామారావు పటేల్, ధనపాల్ సూర్యనారాయణ గుప్తా, ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజి రెడ్డి, జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వీరబెల్లి రఘు నాథ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ముథోల్ బాలికల పాఠశాలకు కంప్యూటర్ బహుకరణ

**నిర్మల్, జూన్ 19, ప్రభాతవార్త:**



తనకు విద్యాబుద్ధులు నేర్పిన గురువుకు ఇచ్చిన మాటను బాసర సర్పంచ్ తీగల వెంకటేష్ గౌడ్ నిలబెట్టుకున్నారు. ముథోల్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు రూ. 50,000 విలువైన నూతన కంప్యూటర్‌ను ఆయన విరాళంగా అందజేశారు. శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గీత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అతిథులు ముందుగా జ్ఞాన సరస్వతి అమ్మవారి చిత్రపటానికి పూజలు నిర్వహించారు. అనంతరం సర్పంచ్ వెంకటేష్ గౌడ్ తన చేతుల మీదుగా కంప్యూటర్‌ను పాఠశాల ఉపాధ్యాయ బృందానికి అప్పగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఈ పాఠశాలలో పనిచేసిన తన గురువు, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు కొక్కుల గంగాధర్ పదవీ విరమణ రోజున, బాసరలో జరిగిన సభలో ఈ పాఠశాలకు కంప్యూటర్ కావాలని కోరినట్లు గుర్తు చేశారు. ఆ రోజు తానిచ్చిన మాట ప్రకారం నేడు గురువు కోరికను నెరవేర్చానని చెప్పారు. తాను ఈ స్థాయికి రావడానికి గంగాధర్ సారే కారణమని కొనియాడారు. ఇదే పాఠశాల నుండి ఇద్దరు విద్యార్థినులు ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించడంపై ఆయన హర్షం వ్యక్తం చేస్తూ, ప్రధానోపాధ్యాయురాలు గీతను శాలువాతో సన్మానించారు. మండల విద్యాధికారి రమణారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం బాసర సర్పంచ్ కంప్యూటర్ అందించడం అభినందనీయమన్నారు. ప్రధానోపాధ్యాయురాలు గీత మాట్లాడుతూ.. రిటైర్మెంట్ రోజు ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చిన వెంకటేష్ గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం దాత వెంకటేష్ గౌడ్‌ను పాఠశాల బృందం శాలువా, మెమెంటోతో ఘనంగా సన్మానించింది. విశ్రాంత ఉపాధ్యాయుడు కొక్కుల గంగాధర్ మాట్లాడుతూ.. తన కోరిక మేరకు శిష్యుడు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంపై భావోద్వేగానికి గురయ్యారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వర్ణలత, కవిత యాదవ్, బాసర మాజీ ఎంపీటీసీ బాలరాజ్ గౌడ్, స్థానిక ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు గణపతి, విద్యార్థినులు పాల్గొన్నారు.

# స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

**- బెల్లంపల్లి స్వర్ణకారుల వినతి**

**బెల్లంపల్లి, జూన్ 19, ప్రభాతవార్త**



సంప్రదాయ వృత్తిగా స్వర్ణకారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని బెల్లంపల్లి పట్టణ స్వర్ణకార సంఘం ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు శుక్రవారం రోజున బెల్లంపల్లి మండల తహసీల్దార్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో విశ్వబ్రాహ్మణ స్వర్ణకారుల పాత్ర విశేషమైనదని గుర్తుచేశారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత తమ వృత్తి అభివృద్ధి చెందుతుందని ఆశించినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో సంప్రదాయ స్వర్ణకారుల జీవనోపాధి సంక్షోభంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా కార్పొరేట్ సంస్థలు భారీ పెట్టుబడులతో ఆధునిక జువెల్లరీ దుకాణాలు స్థాపిస్తూ ఆకర్షణీయమైన ప్రకటనలతో వినియోగదారులను ఆకట్టుకుంటుండటం వల్ల చిన్నతరహా స్వర్ణకారులపై తీవ్ర ప్రభావం పడుతోందని వివరించారు. ఇటీవలి కాలంలో బంగారం ధరలు పెరగడం, తయారీ ఖర్చులు అధికమవడం, కస్టమర్ల అభిరుచుల్లో మార్పులు రావడం వంటి అంశాలు కూడా స్వర్ణకారులపై భారంగా మారాయని పేర్కొన్నారు. గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో సంప్రదాయ బంగారు పనులకు డిమాండ్ తగ్గిపోవడం వల్ల చాలా మంది స్వర్ణకారులు వృత్తిని వదిలి ఇతర ఉపాధుల వైపు మళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. స్వర్ణకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ పలు ముఖ్య డిమాండ్లు ఉంచారు. రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక స్వర్ణకార కార్పొరేషన్ ఏర్పాటు చేసి పాలక మండలిని నియమించాలన్నారు. జీవో 272ను సవరణ చేసి కఠినంగా అమలు చేయడంతో పాటు దొంగ బంగారం కేసుల పేరిట జరుగుతున్న ఇబ్బందుల నుండి స్వర్ణకారులను రక్షించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా 50 సంవత్సరాలు పైబడిన స్వర్ణకార వృత్తిదారులకు గీత, నేత కార్మికుల మాదిరిగా నెలకు రూ.5,000 పింఛన్ మంజూరు చేయాలని కోరారు. ఇంకా బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీ రుణాలు, ఆధునిక యంత్రాలపై శిక్షణ, మార్కెటింగ్ సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. సంప్రదాయ కళలను పరిరక్షించేందుకు ప్రత్యేక ప్రోత్సాహక పథకాలు తీసుకురావాలని కూడా సూచించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి పట్టణ స్వర్ణకార సంఘం అధ్యక్షులు దేవరకొండ మనోహర చారి, ప్రధాన కార్యదర్శి రంగు ఉపేంద్ర చారి, కోశాధికారి గడ్డం శ్రీనివాస చారి సహా పట్టణంలోని పలువురు స్వర్ణకారులు పాల్గొన్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.



# మున్సిపల్ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

పట్టణంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. అనంతరం ఎల్లగౌడ్ తోట పార్క్‌ను సందర్శించిన అదనపు కలెక్టర్ అక్కడ చేపట్టిన అభివృద్ధి పనులు, పరిశుభ్రత, పచ్చదనం, ప్రజలకు అందుబాటులో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. పార్కు నిర్వహణను మరింత మెరుగుపరచడంతో పాటు పచ్చదన పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎ.బి. రామాదేవి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం. శంకర్, పర్యావరణ ఇంజనీర్ డి. ప్రణీల్ కుమార్, అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఓటరు ప్రత్యేక సమగ్ర కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలి

(మొదటిపేజీ తరువాయి)

జరుగుతుందని, పత్రికలలో, ఎలక్ట్రానిక్ మీడియాలలో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పై విస్తృత ప్రచారం నిర్వహిస్తామని తెలిపారు. ఎన్యువరేషన్ ఫారాలు బూత్ స్థాయి అధికారులకు అందించడం జరుగుతుందని, ప్రతిరోజు క్షేత్రస్థాయిలో ప్రక్రియ పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం అధికారులతో సవరణ ప్రక్రియపై సాదా బైనమా దరఖాస్తుల పరిశీలన భూభారతిలో వచ్చిన దరఖాస్తులపై జూమ్ మీటింగ్ నిర్వహించి త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎరువుల దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు

(మొదటిపేజీ తరువాయి)

కారణాలతోనూ రైతులను ఇబ్బందులకు గురి చేయరాదని స్పష్టం చేశారు. ఎరువుల విక్రయాలకు ఇతర ఉత్పత్తులను ముడిపెట్టి ( లింక్ ప్రోడక్ట్ ) విక్రయించిన, రైతులకు బుకింగ్ చేసిన ఎరువులను ఇవ్వకుండా నిరాకరించిన సంబంధిత డీలర్ లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరిక జారీ చేశారు. రైతులకు పారదర్శకంగా, సకాలంలో ఎరువులు అందించడమే ప్రభుత్వా లక్ష్యమని, ఎరువుల పంపిణీలో ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా నిఘా కొనసాగిస్తున్నామని వ్యవసాయ అధికారి రామకృష్ణ తెలిపారు.



తాండూర్ ఐబి లో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు



చెన్నూరులో జన్మదిన వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

# ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

**తాండూర్, జూన్ 19, ప్రభాతవార్త :**

మండల కేంద్రంలోని ఐబిలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు పట్టెం విష్ణు కళ్యాణ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నాయకులు కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు ముడిమడుగుల సురేష్, చందనాల రవికుమార్, నాయకులు ఎండి ఈసా, మాసాడి తిరుపతి, ముదాం గోవర్ధన్, సుందిళ్ల భూమయ్య, ముదాం రఘు, మహేష్, సర్వర్ బేగ్, కిరణ్, మంతెన శివ, పురంశెట్టి అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

**చెన్నూరు జూన్ 19, ప్రభాతవార్త**

కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ 56వ జన్మదిన వేడుకలను మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి రాహుల్ గాంధీ చేపట్టిన జొడో యాత్ర కీలకమని అన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పలు ప్రభుత్వ పథకాలు తీసుకువచ్చాడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పెద్దింటి పద్మ, శ్రీనివాస్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**నిర్మల్, జూన్ 19, ప్రభాతవార్త:**

కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పుట్టినరోజు వేడుకలను శుక్రవారం నిర్మల్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. నిర్మల్ నియోజకవర్గ ఇన్‌చార్జి కూచాడి శ్రీహరి రావు నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా డీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు గాజుల రవికుమార్, కొట్టే శేఖర్, టీపీసీసీ మైనారిటీ నాయకులు అజార్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడుతున్న నాయకుడు రాహుల్ గాంధీ అని కొనియాడారు. దేశ ప్రజల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తూ ఆయన యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారన్నారు. దేశ భవిష్యత్తు అభివృద్ధి దిశగా సాగాలంటే ఆయన వంటి సమర్థవంతమైన నాయకత్వం ఎంతో అవసరమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జిశాన్ అలీ, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ అయ్యన్నగారి పోశెట్టి, దేవరకోట ఆలయ చైర్మన్ ఆమెడా శ్రీనివాస్, మామడ మండల పార్టీ అధ్యక్షులు భుజంగా శ్రీనివాస్ రెడ్డి, పోత రెడ్డి, రఫిక్, మొయినుద్దీన్, అంబాజీ, ఆరే చిరంజీవి, సందీప్, గంగాధర్, నర్సా రెడ్డి, సామా వికాస్ తదితరులు పాల్గొన్నారు.

**భైంసా, జూన్ 19, ప్రభాతవార్త:**

భైంసా పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు, ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ భోజ్జు పటేల్ ఆదేశాల మేరకు ముధోల్ మాజీ శాసనసభ్యులు జి. విఠల్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో నాయకులు కేక్ కట్ చేసి ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ ఎల్లప్పుడూ పేద ప్రజల పక్షాన నిలిచి, వారి హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న ప్రజా నాయకుడని కొనియాడారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ వైస్ ప్రెసిడెంట్ తూర్పాటి వెంకటేష్, ఏఎంసీ వైస్ చైర్మన్ ఎండి ఫరూక్ అహ్మద్, మాజీ జెడ్పీటీసీ ఉత్తమ్ భలేరావు, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, ఖాదీర్, మాజీ ఎంపీటీసీ పోశెట్టి, మార్కెట్ డైరెక్టర్ భూమన్న, మాజీ వైస్ చైర్మన్ ఆసిఫ్, కాంగ్రెస్ పార్టీ



సీనియర్ నాయకులు దేవిదాస్, సాయినాథ్, ధర్మేందర్, మోలాఖాన్, పెద్ద నర్సయ్య, హన్మాండ్లు, లచ్చారామ్, ప్రసాద్, సళ్ళ రాజన్న, నాగేష్, నాగప్ప, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**బెల్లంపల్లి, జూన్ 19, ప్రభాతవార్త**

కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యులు రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని బెల్లంపల్లి కాంటా ఏరియాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మైనార్టీ అధ్యక్షులు గౌస్ నాయకత్వంలో ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ సందర్భంగా ముందుగా కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బాణసంచా కాల్చి ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మరియు కార్యకర్తలు ప్రజలకు పండ్లను పంచిపెట్టి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ రాహుల్ గాంధీ దేశ ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్న నాయకుడని కొనియాడారు. ఆయన నాయకత్వంలో దేశంలో ప్రజాస్వామ్య విలువలు బలపడాలని ఆకాంక్షించారు. పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయగా, స్థానికంగా ఉత్సాహపూరిత వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ గ్రంథాలయ చైర్మన్ తుంగల మల్లేష్, మాజీ ఎంపీటీసీ వెంకటలక్ష్మి, కాంగ్రెస్ పార్టీ నాయకులు దుర్గం సోని, చుంచు వెంకటలక్ష్మి, యూత్ కాంగ్రెస్ నాయకుడు సాయి కిరణ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండి లక్ష్మణ్, అచ్చ శివ, జిల్లా సెక్రెటరీ ఫైన్ గోపి, పెద్ది శ్రీను, యాకూబ్, మీర్జా మెహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

**సారంగాపూర్, జూన్ 19, ప్రభాతవార్త:**

సారంగాపూర్ మండల కేంద్రంలోని స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ నిరంతరం ప్రజల పక్షాన నిలిచి పోరాడుతున్న గొప్ప నాయకుడని కొనియాడారు. ఆయన ఎల్లప్పుడూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, దేశాన్ని మరియు కాంగ్రెస్ పార్టీని మరింత ఉన్నతమైన అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుపోవాలని ఆకాంక్షి స్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హాది, అడెల్లి ఆలయ చైర్మన్ భోజ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొల్లోజీ నర్సయ్య, మాజీ మార్కెట్ చైర్మన్లు దశరథ్, రాజేశ్వర్ రావు, రాజ్ మహమ్మద్, శ్రీనివాస్ రెడ్డి, వంగా రవీందర్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే సర్పంచ్‌లు కోనేరు భూమన్న, వడ్లకొండ దివ్య నవీన్, వరలక్ష్మి సాయన్న, మార్కెట్ డైరెక్టర్లు పోతారెడ్డి, అహమ్మద్ ముక్తార్, మండల నాయకులు అట్లా పోతారెడ్డి, ఉప్పులపు లింగారెడ్డి, నవీన్ రెడ్డి, భూమారెడ్డి, పరికిపండ్ల స్వదేశ్, విలాస్ రావు, బట్టు భోజన్న, మైలి రాజేశ్వర్, బలస్ట్ రాజేశ్వర్, ఒల్లత్రి నారాయణ రెడ్డి, దాసరి లక్ష్మణ్, మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ సాక్ పెల్లి సురేందర్, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

**లక్షెట్టిపేట, జూన్ 19, ప్రభాతవార్త**

మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఆదేశాల మేరకు లక్షెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని ఫంక్షన్ హాల్‌లో రాహుల్ గాంధీ జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి ఘనంగా జన్మదిన వేడుకలను మంచిర్యాల జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్ రావు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దొంత అంజలి నర్సయ్య, పట్టణ అధ్యక్షులు షాహిద్, జిల్లా నాయకులు సువర్ణ అశోక్ కుమార్ కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.



సారంగాపూర్: కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి, నాయకులు



### మారుమూల ప్రాంతాల ప్రజలకు

# నాణ్యమైన ఇంటర్నెట్ సేవలు అందేలా చర్యలు

**ఆసిఫాబాద్, జూన్ 19, ప్రభాతవార్త :**

గ్రామీణ ప్రాంతాలతో పాటు మారుమూల ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన మొబైల్, ఇంటర్నెట్ సేవలు అందేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ కె హరిత అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లో అదనపు కలెక్టర్ డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాతో కలసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొని మాట్లాడారు. జిల్లాలో టెలికాం సేవలను మరింత మెరుగుపరిచేందుకు సెల్ టవర్ల నిర్మాణం, ఆప్టికల్ ఫైబర్ కేబుల్ విస్తరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు, టెలికాం సంస్థల ప్రతినిధులకు సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో డిజిటల్ సేవలు కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో టెలికాం సిబ్బంది మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటికే మంజూరైన సెల్ టవర్ల నిర్మాణం, ఫైబర్ నెట్‌వర్క్ విస్తరణ పనుల పురోగతిని సమీక్షించి, భూ సమస్యలు, అనుమతులు తదితర అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు నిరంతరాయంగా కమ్యూనికేషన్ సేవలు అందించేందుకు టెలికాం సంస్థలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఏడి సర్వేల్యాండ్ రికార్డ్స్ వినయ్, బీఎస్ఎన్ఎల్, జియో, ఎయిర్‌టెల్ తదితర టెలికాం సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.


టెలికాం సంస్థల ప్రతినిధులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ కె హరిత



అవగాహన ర్యాలీలో పాల్గొన్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డా. నాగేంద్ర

## ఘనంగా ప్రపంచ సికిల్ సెల్ దినోత్సవం

**ఆసిఫాబాద్, జూన్ 19, ప్రభాతవార్త :**

ప్రపంచ సికిల్ సెల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని స్పోర్ట్స్ మోడల్ స్కూల్‌లో శుక్రవారం విద్యార్థినులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌వో డా. నాగేంద్ర మాట్లాడుతూ సికిల్ సెల్ అనేది హిమోగ్లోబిన్‌లో అసాధారణ అణువుల కారణంగా వారసత్వంగా సంక్రమించే రుగ్మత అని తెలిపారు. ఈ వ్యాధి వల్ల ఎర్ర రక్తకణాలు చంద్రవంక, కొడవలి ఆకారంలోకి మారి రక్త ప్రసరణకు ఆటంకం కలిగిస్తాయని వివరించారు. సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులు తరచుగా రక్తహీనతకు గురవుతారని, వారికి రక్త మార్పిడి అవసరం ఏర్పడుతుందని చెప్పారు. అదేవిధంగా ఇన్ఫెక్షన్లు కూడా ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. వ్యాధి బారిన పడిన వారు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.


సిసి రోడ్డు పనులకు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించిన సర్పంచ్ తిరుపతి

## నీలాయిపల్లిలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

**తాండూర్, జూన్ 19, ప్రభాత వార్త :**

మండలం నీలాయపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సర్పంచ్ పోలవేణి తిరుపతి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. సీసీ రోడ్డు సమస్యను ఎమ్మెల్యే వినోద్ దృష్టి తీసుకెళ్లమన్నారు. ఎమ్మెల్యే కృషితో రూ.4 లక్షలు ఎన్ఆర్ఈజీఎస్ నిధులు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు సూరం రవీందర్ రెడ్డి, మాదారం సర్పంచ్ కుషనపల్లి లక్ష్మణ్, ఉప సర్పంచ్ రాపల్లి సతీష్, నాయకులు పుట్ట శ్రీనివాస్, జోరీగాల రమేష్, మీస శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## నూతన ప్రెస్ క్లబ్ కమిటీకి జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఘన సన్మానం

**మందమర్రి, జూన్ 19, ప్రభాతవార్త**



మందమర్రి పట్టణ జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన మందమర్రి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, కోశాధికారిని ఘనంగా సన్మానించారు. పట్టణంలోని జాతీయ బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మందమర్రి ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షుడు గజ్జల చందర్, ప్రధాన కార్యదర్శి సలాముద్దీన్, కోశాధికారి సకినాల శంకర్లకు శాలువాలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ, తమపై చూపిన అభిమానానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సన్మానం తమ బాధ్యతలను మరింత పెంచిందని, జర్నలిస్టుల సంక్షేమం మరియు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు మాట్లాడుతూ, నూతన కమిటీ సభ్యులు జర్నలిస్టుల హక్కుల పరిరక్షణతో పాటు ప్రజలకు నిష్పక్షపాత సమాచారాన్ని అందించడంలో ముందుండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పట్టణ జాతీయ బీసీ సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**ఆసిఫాబాద్ టౌన్, జూన్ 19, ప్రభాతవార్త :**

మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సాధికారత శాఖ జిల్లా సంక్షేమ అధికారి స్వరూప రాణి శుక్రవారం ప్రకటన లో తెలిపారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నిరోధక దినోత్సవం సందర్భంగా ఈ నెల 26న జిల్లా కలెక్టర్ కె. హరిత ఆదేశాల మేరకు జిల్లాలో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా స్థాయి అవగాహన సభలు, మాదకద్రవాల వ్యతిరేక భారీ ఈప్రతిజ్ఞ, పాఠశాలలు, కళాశాలల్లో పోస్టర్, నినాద రచన, వ్యాసరచన పోటీలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించే ఐఈసీ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, పోలీసు శాఖ అధికారులు, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ,ప్రజలు పాల్గొననున్నారని చెప్పారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవరచుకోవాలని, మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని తెలిపారు. జిల్లాలోని ప్రతి పౌరుడు జాతీయ మాదకద్రవ్యాల నిరోధక ఈప్రతిజ్ఞ చేయాలని కోరారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఆన్‌లైన్ వేదిక ద్వారా ప్రతిజ్ఞ చేయవచ్చని తెలిపారు.

## ఆశ్రమ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, పోషకాహారం అందించాలి: ఐటీడీఏ పీఓ మంద మకరందు

**వేమనపల్లి, జూన్ 19, ప్రభాతవార్త**

విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి మంద మకరందు అధికారులను ఆదేశించారు. శుక్రవారం వేమనపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన ఆయన పాఠశాలలోని విద్యా, వసతి, భోజన సదుపాయాలను పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు పోషకాహారం అందించాలని, పరిశుభ్రత ప్రమాణాలు పాటించాలని సూచించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. వసతి గృహాలు, భోజనశాల, తాగునీటి సౌకర్యాలను పరిశీలించిన ఆయన అవసరమైన మరమ్మత్తులను వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థినుల ఆరోగ్య సంరక్షణ, రక్తహీనత నివారణ చర్యలను క్రమం తప్పకుండా అమలు చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్న ఆయన, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీటీడీఓ శ్రీదేవి, ఏటీడీవో సురేష్, ప్రధానోపాధ్యాయులు మాధవ్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



## రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

### - మండల వ్యవసాయ శాఖ అధికారి సుష్మ

**తాండూర్, జూన్ 19, ప్రభాతవార్త :**

రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి సుష్మ అన్నారు. మండలంలోని గోపాల్ నగర్ గ్రామ రైతులకు శుక్రవారం ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ సాగు విధానాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి సుష్మా మాట్లాడుతూ రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మళ్లడం ద్వారా భూమి ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుందని అన్నారు. రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని తగ్గించడం వల్ల నేల సారవంతంగా ఉండి పంటల దిగుబడులు స్థిరంగా ఉంటాయని తెలిపారు.వరి, మొక్కజొన్న పంటల అవశేషాలను కంపోస్టు ఎరువులుగా వినియోగించడం, పచ్చిరొట్ట ఎరువుల పంటలను ప్రోత్సహించడం, పంటల మార్పిడి విధానాన్ని అమలు చేయడం ద్వారా నేల సారాన్ని పెంచుకొని రైతులు అధిక ఆదాయం పొందవచ్చని సూచించారు. పప్పుధాన్యాలు, కూరగాయలు, పండ్ల పంటలు, ఆయిల్ పామ్ ఆధారిత అంతర పంటల సాగు వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గాట్ల నరసయ్య, ఉద్యానవన అధికారి అర్చన, ఏఈఓలు రాకేష్, కృషి సఖీ మమత, రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మండల వ్యవసాయ శాఖ అధికారి సుష్మ

## మండల కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీ నియామకం

**తాండూర్, జూన్ 19, ప్రభాతవార్త :**

తాండూర్ మండల కాంగ్రెస్ పార్టీ మండల నూతన కమిటీని మంచిర్యాల డిసిసి అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మండల ఉపాధ్యక్షులుగా షేక్ మోమిన్ అలీ, తాళ్లపల్లి శంకర్ గౌడ్, చిట్ల రమేష్, ప్రధాన కార్యదర్శిగా అడప నవీన్ కుమార్, కటకల మల్లేష్, మార్చుకురి సంతోష్, వేముర్ల శ్రీనివాస్, కార్యదర్శులుగా మాసాడి ప్రభాకర్, జైన సాంబయ్య, గాజుల తిరుపతి, కోరల రాజు, ఎండి అజ్గర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా గుర్రం మహేందర్, కొంక అశోక్, గాజుల రమేష్, తనీ భీమేష్, పెద్ద బోయిన రవీందర్, సాత నాగరాజు, స్పోక్ పర్సన్గా మొహమ్మద్ గౌస్, సోషల్ మీడియా సభ్యుడిగా పుప్పాల కోయిల్ పటేల్ లను నియమించినట్లు ఆయన పేర్కొన్నారు.

# ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం విజయవంతం చేయాలి

**- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**

**నస్పూర్, జూన్ 19, ప్రభాతవార్త**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఈఆర్ఓలు, ఎఈఆర్ఓలతో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 25వ తేదీ నుంచి జూలై 24వ తేదీ వరకు బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటికి ఎన్యూమరేషన్ ఫారాలు అందజేయడం, ఫారం పూర్తి చేసిన తర్వాత తిరిగి తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బూత్ స్థాయి అధికారులు ముఖ్యపాత్ర పోషిస్తారని, ముఖ్యంగా పట్టణాలలో మ్యాపింగ్, అన్ మ్యాపింగ్ విభాగాలుగా సమాచారాన్ని విభజించి సవరణ కార్యక్రమం చేపట్టాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్లకు సమావేశాలు నిర్వహించి సంబంధిత ఫోటోలు, మీటింగ్ మినిట్స్ నమోదు చేయాలని తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారాలు స్థానిక భాషలో ముద్రించబడతాయని, బూత్ స్థాయి అధికారుల ద్వారా ఓటర్లకు అందజేయబడిన ఎన్యూమరేషన్ ఫారాలు తీసుకొని సంబంధిత పోర్టల్ లో అప్లోడ్ చేయాలని తెలిపారు. జిల్లా స్థాయిలో కలెక్టర్లు, ఈఆర్ఓలు క్షేత్రస్థాయిలో తరచుగా పర్యటించి సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పరిశీలించాలని తెలిపారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై మీడియా ద్వారా ప్రజలకు తెలియజేయాలని, మ్యాపింగ్ చేయబడని ఓటర్ల వివరాలను అప్డేట్ ఆప్షన్ ద్వారా నమోదు చేయాలని తెలిపారు. జూలై 24వ తేదీ లోగా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ పూర్తి చేయడం జరుగుతుందని, జూలై 31వ తేదీన ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించడం జరుగుతుందని, జూలై 31వ తేదీ నుంచి ఆగస్టు 30వ తేదీ వరకు అభ్యంతరాల స్వీకరణ, జూలై 31వ తేదీ నుంచి సెప్టెంబర్ 28వ తేదీ వరకు అభ్యంతరాల పరిష్కరణ, అక్టోబర్ 1వ తేదీన తుది ఓటరు జాబితా ప్రచురణ జరుగుతుందని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించాలని,



మీటింగ్ మినిట్స్ నమోదు చేయాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణలో భాగంగా ప్రతి పోలింగ్ కేంద్రంలో 1 వేయి 200 మందికి మించి ఓటర్లు ఉండకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల సంబంధించిన బూత్ స్థాయి అధికారుల వివరాలు ప్రజలందరికీ తెలిసేలా ప్రచారం చేయాలని, బూత్ స్థాయి అధికారులకు వృద్ధ, అనారోగ్య, దివ్యాంగ ఓటర్ల నమోదు విషయంపై ప్రత్యేక శిక్షణ అందించాలని తెలిపారు. ఒకే కుటుంబం సంబంధించిన ఓటర్లందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మీడియా, సోషల్ మీడియా ద్వారా వచ్చే ప్రతికూల వార్తలపై వెంటనే స్పందించాలని, తప్పుడు ప్రచారాన్ని నిరోధించాలని తెలిపారు.

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పురస్కరించుకొని జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు, బూత్ స్థాయి అధికారులకు శిక్షణ నిర్వహించి అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై జిల్లాలో బ్యానర్లు, హోర్డింగ్ల ద్వారా ప్రచారం నిర్వహించడం జరుగుతుందని, ప్రతివారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాసరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, ఎన్నికల సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**పట్టణ అధ్యక్షుడు తిరుమల్ రెడ్డి ఆధ్వర్యంలో**

# రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

**మందమర్రి, జూన్ 19, ప్రభాతవార్త**





మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలోని సింగరేణి మనోవికాస పాఠశాలలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంద తిరుమల్ రెడ్డి ఆధ్వర్యంలో లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నోముల ఉపేందర్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ పైడిమల్ల నర్సింగ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పుల్లూరి లక్ష్ముణ్ణ్‌తో పాటు సీనియర్ నాయకులు, మహిళా నాయకురాళ్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాహుల్ గాంధీ ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతూ, పార్లమెంట్‌లో ప్రజల గొంతుకగా నిలుస్తున్నారని కొనియాడారు. దేశ ప్రజల కోసం త్యాగాలు చేసిన కుటుంబ వారసత్వాన్ని కొనసాగిస్తూ ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేస్తున్న నాయకుడిగా రాహుల్ గాంధీ నిలిచారని పేర్కొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీని కేంద్రం, రాష్ట్ర స్థాయిలో మరింత బలోపేతం చేయాలని, పార్టీ కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం పేదలు, కార్మికులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. అనంతరం మనోవికాస పాఠశాల విద్యార్థులకు పండ్లు, పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, మహిళా నాయకురాళ్లు, యూత్ కాంగ్రెస్ నాయకులు, 24 వార్డుల నాయకులు, సోషల్ మీడియా వారియర్స్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**మంచిర్యాల, జూన్ 19, ప్రభాతవార్త**

రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను మంచిర్యాల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మాజీ జిల్లా అధ్యక్షురాలు సురేఖ ఆదేశాల మేరకు మంచిర్యాల శాసనసభ్యుల నివాసంలో వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా నాయకులు జన్మదిన కేకును కోసి రాహుల్ గాంధీకి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాసేవలో ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని, దేశ ప్రజల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడుతున్న నాయకుడిగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో దేవాపూర్ ఆదాని సిమెంట్ సంస్థ కార్మిక సంఘం అధ్యక్షులు కొక్కిరాల సత్యపాల్ రావు, మంచిర్యాల నగరపాలక సంస్థ మేయర్ ధర్ని మధుకర్, మంచిర్యాల నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తూముల నరేష్, పురపాలక సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకురాళ్లు, జాతీయ విద్యార్థి సంఘ నాయకులు, యువ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగగా, పార్టీ శ్రేణులు రాహుల్ గాంధీ దీర్ఘాయుష్షుతో మరెన్నో సేవలు అందించాలని ఆకాంక్షించాయి.



అవగాహన కల్పిస్తున్న ఏఎస్పీ సాయి కిరణ్

# పిప్రి కాలనీలో కార్డన్ అండ్ సెర్చ్

**- ప్రతి పౌరుడు నేర నివారణలో భాగస్వామి కావాలి**

**భైంసా, జూన్ 19, ప్రభాతవార్త:**

జిల్లా ఎస్పీ డాక్టర్ జి.జానకి షర్మిల ఆదేశాల మేరకు భైంసా సబ్ డివిజన్ పరిధిలోని పిప్రి కాలనీలో శుక్రవారం పోలీసులు భారీ కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ తనిఖీల్లో సరైన పత్రాలు, అనుమతులు లేకుండా నడుపుతున్న 121 ద్విచక్ర వాహనాలను, ఒక ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకుని, నిబంధనల ప్రకారం జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా భైంసా ఏఎస్పీ సాయి కిరణ్ మాట్లాడుతూ.. కాలనీలోని ప్రతి పౌరుడు నేర నివారణలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. సైబర్ నేరాలు, ట్రాఫిక్ సమస్యలు, నిషేధిత మత్తు పదార్థాల వినియోగం, డ్రైవింగ్ చేస్తూ మొబైల్ మాట్లాడటం, మద్యం సేవించి వాహనాలు నడపడం, మైనర్ డ్రైవింగ్ వంటి సామాజిక రుగ్మతలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వివరించారు. ఆస్తి సంబంధిత నేరాల నివారణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమన్నారు. కాలనీవాసులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి నేను సైతం కార్యక్రమంలో భాగంగా కాలనీలో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఏఎస్పీ సూచించారు. పిప్రి కాలనీ జాతీయ రహదారికి (హైవే) ఆనుకొని ఉన్నందున, కాలనీ లోపలి నుండి బయటకు వచ్చేటప్పుడు వాహనదారులు కొద్దిసేపు ఆగి, రహదారి ఇరువైపులా చూసుకుని జాగ్రత్తగా వెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో భైంసా టౌన్ ఇన్‌స్పెక్టర్ సాయి కుమార్, ఎస్సైలు నవనీత్ రెడ్డి, నాగభూషణం, దయాల్ సింగ్, పోలీస్ సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

# వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అదనపు డైరెక్టర్‌కు సన్మానం

**భైంసా, జూన్ 19, ప్రభాతవార్త:**

భైంసా, కుబీర్ మార్కెట్ కమిటీ కార్యాలయాలను తెలంగాణ వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అదనపు డైరెక్టర్ ఆర్. లక్ష్మణుడు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మార్కెట్ కమిటీ పరిధిలోని మౌలిక సదుపాయాలను పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భైంసా మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఆయనను చైర్మన్ సిందే ఆనందరావు పాటిల్ శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనందరావు పాటిల్ మాట్లాడుతూ.. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మార్కెట్ యార్డ్‌లో అదనపు గోదాముల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని అదనపు డైరెక్టర్‌ను కోరారు. అలాగే మార్కెట్ కమిటీల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పన కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై అదనపు డైరెక్టర్ ఆర్. లక్ష్మణుడు స్పందిస్తూ.. ఈ ప్రతిపాదనలను పరిశీలించి త్వరలోనే ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భైంసా ఆత్మ కమిటీ చైర్మన్ సిద్ధంవార్ వివేకానంద, కుబీర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కళ్యాణ్, వైస్ చైర్మన్ ఫారూక్ అహ్మద్, డైరెక్టర్లు, అధికారులు, సిబ్బంది, రైతు ప్రతినిధులు పాల్గొన్నారు.





ర్యాలీ ప్రారంభిస్తున్న దృశ్యం

## ప్రపంచ సికిల్ సెల్ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ

**- వంశపారంపర్య పరీక్షలపై ప్రజల్లో చైతన్యం కల్పించాలి**

మంచిర్యాల, జూన్ 19, ప్రభాతవార్త

ప్రపంచ సికిల్ సెల్ దినోత్సవం సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైద్య ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో సికిల్ సెల్ వ్యాధి, వంశపారంపర్య పరీక్షలపై అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుధాకర్ నాయక్, ఆసుపత్రి నివాస వైద్య అధికారి డాక్టర్ శ్రీధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సికిల్ సెల్ వ్యాధి వంశపారంపర్యంగా సంక్రమించే వ్యాధి కావడంతో ముందస్తు పరీక్షలు, అవగాహన ఎంతో అవసరమని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు, సికిల్ సెల్ తలసేమియా జిల్లా కార్యవర్గ సభ్యులు కాసర్ల శ్రీనివాస్, చుంచు శంకర వర్మ, అవినాష్, కంకణాల భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సామూహిక మాధ్యమాల అధికారి బుక్క వెంకటేశ్వర్, అల్లాడి శ్రీనివాస్, నామదేవ్, కాకినాడ వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, పుట్ట సత్తయ్యతో పాటు పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది హాజరయ్యారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో కూడా సికిల్ సెల్ వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, ప్రజలకు ముందస్తు పరీక్షల ప్రాముఖ్యతను వివరించడం జరుగుతుందని అధికారులు తెలిపారు.

## బెల్లంపల్లిలో నీటి ఎద్దడి సమస్యపై అధికారులతో చర్చలు

**- ప్రతిరోజు 4-5 ఎం ఎల్ డి నీటి సరఫరాకు హామీ**

బెల్లంపల్లి, జూన్ 19, ప్రభాతవార్త

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలో తీవ్రంగా నెలకొన్న తాగునీటి ఎద్దడి సమస్య పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు చేపట్టారు. బెల్లంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతిరమేష్ బాబు, మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు మున్సిపల్ అధికారులు ఆసిఫాబాద్ జిల్లాలోని అడ ప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథకు చెందిన ఎస్ఈ, డీఈ, ఈఈ స్థాయి అధికారులతో సమావేశమై బెల్లంపల్లి పట్టణంలో నెలకొన్న నీటి సమస్యను వివరించారు. అడ ప్రాజెక్టు నుంచి ప్రతిరోజూ నీరు సరఫరా కావాల్సి ఉండగా ప్రస్తుతం ప్రతి 10 రోజులకు ఒకసారి మాత్రమే నీరు అందుతోందని చైర్‌పర్సన్ దావ స్వాతిరమేష్ బాబు తెలిపారు. దీనివల్ల పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆమె అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పట్టణ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతిరోజూ కనీసం 6 ఎమ్మెల్డి నీటిని సరఫరా చేయాలని వారు కోరారు. ఈ విషయంపై స్పందించిన మిషన్ భగీరథ అధికారులు బెల్లంపల్లి పట్టణానికి రోజుకు 4 నుంచి 5 ఎంఎల్డి నీటిని నిరంతరం సరఫరా చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అధికారుల హామీతో పట్టణ ప్రజలకు కొంత మేర ఉపశమనం లభించే అవకాశముందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



# కేజీబీవీలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**- విద్యార్థుల సమస్యలు తెలుసుకున్న భవేశ్ మిశ్రా**

దిలావర్‌పూర్, జూన్ 19, ప్రభాతవార్త:



దిలావర్‌పూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న విద్యా ప్రమాణాలు, వసతి సదుపాయాలు, భోజన నాణ్యతను ప్రత్యక్షంగా పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ముందుగా పాఠశాల హాజరు పట్టికను పరిశీలించిన కలెక్టర్, ఉపాధ్యాయులు మరియు సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. పలు అంశాలపై ప్రశ్నలు అడిగి వారి అభ్యాస స్థాయిని పరిశీలించారు. పాఠ్యాంశాలతో పాటు సమాజంలో జరుగుతున్న పరిణామాలపై కూడా అవగాహన పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు.

### మెనూ ప్రకారం భోజనం అందించాలి

వసతి గృహంలోని స్టోర్‌రూమ్‌ను తనిఖీ చేసిన కలెక్టర్, నిల్వ ఉంచిన కూరగాయలు, ఇతర ఆహార సరుకుల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన సరుకులను మాత్రమే వినియోగించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం పోషకాహారంతో కూడిన భోజనం అందించాలని స్పష్టం చేశారు. తనిఖీ సందర్భంగా విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన కలెక్టర్, భోజన నాణ్యతపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. పాఠశాలలో ఏవైనా సమస్యలు ఉంటే నిర్భయంగా ఉపాధ్యాయులు లేదా అధికారుల దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, డీఆర్ఓ రాథోడ్ రమేష్, తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్, ఇతర అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



## దళిత రత్న అవార్డు గ్రహీతకు ఘన సన్మానం

మందమర్రి, జూన్ 19, ప్రభాతవార్త

మందమర్రి పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇటీవల దళిత రత్న అవార్డు అందుకున్న రామంచ కుమార్ కు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంద తిరుమలరెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని మనోవికాస్ స్కూల్ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో రామంచ కుమార్‌కు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, సామాజిక సేవా రంగంలో రామంచ కుమార్ చేస్తున్న సేవలకు గుర్తింపుగా దళిత రత్న అవార్డు లభించడం గర్వకారణమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఆయన మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు మరియు పలువురు ప్రముఖులు పాల్గొని రామంచ కుమార్‌కు అభినందనలు తెలిపారు.

## ఎమ్మెల్యే కృషితో మండలానికి ఎనిమిది గిడ్డంగులు మంజూరు

సారంగాపూర్, జూన్ 19, ప్రభాతవార్త:



మండలంలో రైతులు పండించిన ధాన్యాన్ని నిల్వ ఉంచుకోవడానికి నియోజకవర్గంలో సరైన గిడ్డంగులు లేవు. ఈ సమస్య కారణంగా రైతులు పడుతున్న ఇబ్బందులను గమనించిన బీజేపీ శాసనసభాపక్ష నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి గిడ్డంగుల అవశ్యకతపై ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం సారంగాపూర్ మండలానికి ఎనిమిది గిడ్డంగులను మంజూరు చేసింది. మండలానికి పెద్ద సంఖ్యలో గిడ్డంగులను మంజూరు చేయించినందుకు ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డికి బీజేపీ మండల అధ్యక్షుడు కాల్వ నరేష్, ప్రముఖ నాయకులు రామ్ శంకర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గిడ్డంగుల ఏర్పాటుతో ఈ ప్రాంత రైతులకు ధాన్య నిల్వ సమస్యలు తొలగిపోతాయని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజు రెడ్డి, దయాకర్ రెడ్డి, సత్యపాల్ రెడ్డి, కరిపె విలాస్, గంగారెడ్డి, బడి పోతన్న, సబ్లె నానక్ సింగ్, కరుణాసాగర్ రెడ్డి, చిన్నయ్య, నారాయణ, మధు, రంజిత్, ప్రకాష్, సాహెబ్ రావు, వినోద్, చంద్రప్రకాష్ గౌడ్, సర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక హక్కుల కోసం టోల్‌గేట్ వద్ద సమ్మె బాట

**- హక్కులు కాలరాస్తున్నారంటూ డ్రైవర్ల ఆందోళన**

మందమర్రి, జూన్ 19, ప్రభాతవార్త



ఆర్చి లైట్ కంపెనీ యాజమాన్యం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మందమర్రి టోల్‌గేట్ వద్ద పెట్రోలింగ్ వాహనాల డ్రైవర్లు, హెల్పర్లు, ఆర్‌పీఓలు ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ నాయకులు మాట్లాడుతూ, గతంలో కార్మికుల పోరాటాల ఫలితంగా ఈఎస్ఐ, పీఎఫ్, బోనస్, ప్రభుత్వ జీవో ప్రకారం కనీస వేతనాలు, జాతీయ పండుగల రోజుల్లో విధులు నిర్వహించిన వారికి డబుల్ వేతనం వంటి హక్కులను సాధించుకున్నామని తెలిపారు. అయితే ఇటీవల టోల్‌గేట్‌కు ఇన్‌ఛార్జిగా వచ్చిన జితేందర్ కార్మికుల మధ్య విభేదాలు సృష్టించి, యూనియన్‌కు దూరం చేసే ప్రయత్నాలు చేశారని ఆరోపించారు. యూనియన్‌తో కుదిరిన ఒప్పందాలకు విరుద్ధంగా తక్కువ వేతనాలు చెల్లించడం, పీఎఫ్ చందాలు తక్కువగా జమ చేయడం, పండుగ రోజుల్లో పనిచేసినా అదనపు వేతనాలు చెల్లించకపోవడం, పాత డ్రైవర్లను తొలగించి కొత్త వారిని నియమించడం వంటి చర్యలతో కార్మికుల హక్కులను హరించారని విమర్శించారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో ఆర్చి లైట్ కంపెనీకి వ్యతిరేకంగా డ్రైవర్లు నేటి నుంచి నిరవధిక సమ్మె చేపట్టారని తెలిపారు. అక్రమంగా తొలగించిన అంబులెన్స్ డ్రైవర్‌ను తిరిగి విధుల్లోకి తీసుకోవడంతో పాటు, కార్మికులు కోల్పోయిన అన్ని హక్కులు పునరుద్ధరించే వరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) ఈ పోరాటానికి సంపూర్ణ మద్దతు ప్రకటించిందని, కార్మికుల న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు ఉద్యమం కొనసాగుతుందని నాయకులు హెచ్చరించారు. ఈ సమ్మెలో ఐఎఫ్‌టీయూ మంచిర్యాల జిల్లా కార్యదర్శి డి. బ్రహ్మానందం, జిల్లా నాయకులు ఎస్. తిరుపతి రెడ్డి, ఎండీ జాఫర్ తదితరులు పాల్గొని సంఘీభావం తెలిపారు.

## మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి

మంచిర్యాల, జూన్ 19, ప్రభాతవార్త

మంచిర్యాల రైల్వే స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం విషాద ఘటన చోటుచేసుకుంది. రైల్వే స్టేషన్ ఎగువ రైలు పట్టాల మధ్య సుమారు 35, 40 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని పురుషుడు రైలు కిందపడి మృతి చెందినట్లు జి.ఆర్.పీ పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం, శుక్రవారం ఉదయం 7 గంటల ముందు మృతుడు రైలు పట్టాలు దాటుతున్న సమయంలో గానీ, లేదా ఇతర కారణాల వల్ల గానీ ప్రమాదవశాత్తు రైలు కిందపడి మరణించి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. మృతుడి వద్ద ఎలాంటి చిరునామా లేదా గుర్తింపు ఆధారాలు లభించలేదు. మృతుడు పసుపు రంగు టీ షర్ట్, బ్లూ రంగు జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడు. అలాగే కుడి చేతి దండ రెక్కపై "అనిత" అని హిందీ భాషలో పచ్చబొట్టు టాటూ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. తదుపరి విచారణ నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మంచిర్యాల మార్చురీలో భద్రపరిచారు. జి.ఆర్.పీ ఎస్సై మహేందర్ ఆదేశాల మేరకు హెడ్ కానిస్టేబుల్ కేంసారం సంపత్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు లేదా కుటుంబ సభ్యుల వివరాలు తెలిసిన వారు వెంటనే 9701112343 లేదా 8328512176 నంబర్లకు సంప్రదించి పోలీసులకు సమాచారం అందించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియ పకడ్బందీగా జరగాలి

**- సీఈఓ సుదర్శన్ రెడ్డి**



**నిర్మల్, జూన్ 19, ప్రభాతవార్త:**

రాష్ట్రంలో చేపట్టబోయే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో ఎలాంటి లోటుపాట్లు ఉండొద్దని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ.. ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ ప్రక్రియ అత్యంత పకడ్బందీగా జరగాలన్నారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే బీఎల్ఓలకు అన్ని అంశాలపై పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా జిల్లాల్లో రాజకీయ పార్టీలతో నిర్వహించిన సమావేశాల వివరాలను ఈ సందర్భంగా కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. పూర్తిస్థాయిలో పర్యవేక్షిస్తాం – కలెక్టర్ భవేశ్ మిశ్రా: నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా వీసీలో మాట్లాడుతూ.. జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను అంతటా పూర్తిస్థాయిలో పర్యవేక్షిస్తామని సీఈఓకు వివరించారు. ఓటర్ల జాబితా సవరణపై ఇప్పటికే జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, వారి సూచనలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో నిర్మల్ అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, డీఆర్ఓ రాథోడ్ రమేష్, ఆర్డీఓ దేవీదాస్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు స్వాతి మరియు సిబ్బంది పాల్గొన్నారు.



అంగన్వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్న అక్షరాభ్యాసం కార్యక్రమం

## అంగన్వాడి కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం

**తాండూర్, జూన్ 19, ప్రభాతవార్త :**

తాండూర్ గ్రామపంచాయతీ పరిధిలోని కొత్తగుడిసెలు అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ముడిమడుగుల సురేష్ చిన్నారులతో ఓంకారం, అక్షరాలు దిద్దించారు. అంతకుముందు గ్రామంలో అంగన్వాడి బాట ర్యాలీ నిర్వహించారు. వార్డ్ సభ్యుడు శ్రీకాంత్ నోట్ బుక్కులు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీల సూపర్వైజర్ స్వరూప రాణి, టీచర్ స్వప్న, పిల్లలు, తల్లి తండ్రులు పాల్గొన్నారు.

## యూరియా కోసం రైతన్నల తిప్పలు..

**లింగాపూర్, జూన్ 19, ప్రభాతవార్త**

లింగాపూర్ మండలంలో యూరియా కోసం గంటల తరబడి వేచి చూస్తున్న రైతులు. ఎరువుల దుకాణాల వద్ద యూరియా స్టాక్ చూసుకొని యాప్ లో బుక్ చేసుకొని యూరియా కోసం గంటల తరబడి నిలబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి. చేను చేదును చేసి విత్తుకు సిద్ధం కావలసిన సమయంలో ఇదేం గోస అని రైతుల ఆవేదన వ్యక్తం చేశారు. ఎరువుల దుకాణాల వద్ద తగినంత బస్తాలు చూసుకొని యాప్ లో బుక్ చేసుకొని వస్తే రసీదు తీసుకున్న తర్వాత రెండు రోజులలో యూరియా బస్తాలు ఇస్తామని చెప్పడం ఏంటి అని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని బుక్ చేసుకున్న రోజునే యూరియా బస్తాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు, కనక సేకు. ఆడ జంగు, మారుతి, ఆడే రవీందర్ తదితర రైతులు కోరుతున్నారు.





## ఏఎస్పీ సాయి కిరణ్‌ను ఘనంగా సన్మానించిన పీఆర్‌టీయూఎస్ నాయకులు

**భైంసా, జూన్ 19, ప్రభాతవార్త:**

భైంసా డివిజన్ నూతన ఏఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన పత్తిపాక సాయి కిరణ్‌ను పీఆర్‌టీయూఎస్ ఉపాధ్యాయ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ రమణారావు ఆధ్వర్యంలో ఏఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏఎస్పీ సాయి కిరణ్ మాట్లాడుతూ.. పాఠశాలల్లో విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రస్తుత కాలంలో విద్యార్థులు ఎలాంటి చెడు అలవాట్లకు లోనుకాకుండా ఉండేందుకు పాఠశాలల పరిధిలో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు సరైన మార్గదర్శకులుగా నిలిచి, వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భైంసా మండల అధ్యక్షుడు ఎస్. గంగాధర్, ప్రధాన కార్యదర్శి ఎన్. కృష్ణ, ముధోల్ మండల ప్రధాన కార్యదర్శి అబ్దుల్ ఆహత్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సలీం మహమ్మద్ ఖాన్, జిల్లా ఉపాధ్యక్షుడు గోపాల్, బాసర మండల కార్యవర్గ సభ్యులు కౌసర్, నాగన్న, సునీల్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అర్జున్‌ను సన్మానిస్తున్న పార్ట్ టైం స్లిపర్స్

## జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శిని సన్మానించిన పార్ట్ టైం స్వీపర్స్

**తాండూర్, జూన్ 19, ప్రభాతవార్త :**

మంచిర్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ నూతన కార్యదర్శిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన అర్జున్ ను శుక్రవారం జిల్లాలోని గ్రంథాలయాల పార్ట్ టైం స్వీపర్స్ మర్యాదపూర్వం కలిసి సన్మానించారు. పార్ట్ టైం స్వీపర్స్ యూనియన్ సహాయ కార్యదర్శి చెరుకుపల్లి స్వామి మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో పని చేస్తున్నామన్నారు. మూడు నెలలుగా జీతాలు రావడంలేదని, దీంతో అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి తమ సమస్యలను తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. అదేవిధంగా గ్రేడ్ 2 మంచిర్యాల లైబ్రేరియన్ గా ప్రమోషన్ పొందిన మురళి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్ట్ టైం స్వీపర్లు సంతోష్, ఆంజనేయులు, మధుకర్, సాయికృష్ణ, సత్యనారాయణ, మధుకర్ పాల్గొన్నారు.

## ఎస్.ఐ.ఆర్. ప్రక్రియ పట్ల అప్రమత్తంగా వివరించాలి

**- జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి**



**తాండూర్, జూన్ 19, ప్రభాతవార్త :**

ఎస్.ఐ.ఆర్ (సర్) ప్రక్రియ పట్ల కాంగ్రెస్ పార్టీ బిఎల్ఏలు అప్రమత్తంగా వ్యవహరించాలని మంచిర్యాల డిసిసి అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి అన్నారు. స్థానిక సురభి గార్డెన్ లో శుక్రవారం మండలంలోని కాంగ్రెస్ పార్టీ బిఎల్ఏల సమావేశం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఈనెల 25 నుంచి వచ్చే నెల 25 వరకు రాష్ట్రంలో ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ పార్టీ బిఎల్ఏలు ప్రతి బూత్‌లో అర్హులైన ఓటర్ల పేర్లు ఉన్నాయా? లేదా? అనే విషయాన్ని తప్పనిసరిగా చూసుకోవాలన్నారు. సర్ అమలులో, ఓటర్ల పేర్లు తొలగింపు, నమోదు ప్రక్రియలు ఏమైనా పొరపాట్లు జరిగితే వెంటనే సంబంధిత అధికారు దృష్టికి తీసుకెళ్లాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధినేత లోక్సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ దేశ ప్రధాని అయ్యేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా నాయకులు కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పెద్ద బోయిన శంకర్, డిసిసి ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి నాయకులు సల్వాజ్ మహేందర్ రావు గట్టు మురళీధర్ రావు, కాపర్తి సుభాష్ మోసిన అలీ, సాలిగామ బానయ్య, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

## కోసినిలో జీవశక్తి పెంచిన (బయో ఫోర్టిఫైడ్) వరి విత్తనాల పంపిణీ

**కాగజ్‌నగర్ రూరల్, జూన్ 19, ప్రభాతవార్త :**

కోసిని గ్రామ పంచాయతీ పరిధిలో రైతాంగానికి మేలు చేకూర్చే ఉద్దేశంతో హెర్బల్ లైఫ్ వారి సహకారంతో జల్ జీవిక వారి అధ్వర్యంలో జీవశక్తి పెంచిన (బయో ఫోర్టిఫైడ్) సరికొత్త వరి రకం డీఆర్ఆర్ ధన్ 48 (డీఆర్ఆర్ ధన్ 48) విత్తనాల పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వసాకే పూల్లబాయి ముఖ్య అతిథుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతు ప్రస్తుత కాలంలో వరి రకాల్లో వస్తున్న మార్పులను, వాటి దిగుబడి సామర్థ్యాన్ని రైతులకు వివరించారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులను పాటిస్తూ నాణ్యమైన విత్తనాలను ఎంచుకోవడం ద్వారా రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలను ఆర్జించవచ్చని ఆమె పేర్కొన్నారు. అనంతరం జలజీవిక కోర్డినేటర్ అభితంజలి ప్రత్యేకంగా డీఆర్ఆర్ ధన్ 48 వరి రకం విశిష్టతలను రైతులకు వివరించారు. ఈ రకం వరిలో జింక్ పోషకాలు పుష్కలంగా ఉంటాయని, ఇది పిల్లలు, పెద్దల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. అంతేకాకుండా, తక్కువ గ్లైసిమిక్ ఇండెక్స్ కలిగి ఉండటం వల్ల మధుమేహం (షుగర్) ఉన్నవారికి కూడా ఈ బియ్యం ఎంతో ప్రయోజనకరమని, తెగుళ్లను తట్టుకునే శక్తి ఈ రకానికి ఎక్కువగా ఉందని ఆయన వివరించారు. గ్రామ పెద్దలు మాట్లాడుతూ ఈ రకం వరి ధాన్యం తో రైతులకు మేలు జరుగుతుంది అని అన్నారు. ఈ విత్తనాల పంపిణీ కార్యక్రమంలోజల్ జీవిక సిబ్బంది కిషోర్, శ్రీనివాస్ మరియు గ్రామానికి చెందిన పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొని విత్తనాలను స్వీకరించారు. విత్తనాలతో పాటు వాటిని సాగు చేసే విధానాలపై అధికారులు ఇచ్చిన సలహాల పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు.



# అభివృద్ధి పనులకు రూ.28.15 కోట్ల కేంద్ర నిధులు మంజూరు

## - ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

నిర్మల్, జూన్ 19, ప్రభాతవార్త:



నిర్మల్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల కోసం కేంద్ర ప్రభుత్వం రూ.28.15 కోట్ల నిధులు మంజూరు చేసిందని బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో నూతన సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం కోసం రూ.19.15 కోట్లు, 30 గ్రామాల్లో అగ్రికల్చర్ గోదాముల నిర్మాణం కోసం రూ.9 కోట్లు మంజూరైనట్లు ఆయన వెల్లడించారు. ఈ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, కేంద్ర నిధులతోనే గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన జరుగుతోందని ఎమ్మెల్యే అన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణంతో గ్రామాల్లో రవాణా, పారిశుధ్య సమస్యలు తీరతాయని, అగ్రికల్చర్ గోదాములతో రైతులకు పంట నిల్వ సౌకర్యం మెరుగుపడుతుందని ఏలేటి ఆశాభావం వ్యక్తం చేశారు.

# నేడు ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్టుల జిల్లా మహాసభ

నిర్మల్, జూన్ 19, ప్రభాతవార్త:

తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ నిర్మల్ జిల్లా ప్రథమ మహాసభ శనివారం జిల్లా కేంద్రంలో జరగనుంది. శుక్రవారం పట్టణంలోని ఆర్అండ్బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కుంటోల్ల వెంకటస్వామి ఈ వివరాలను వెల్లడించారు. శనివారం ఉదయం 11 గంటలకు స్థానిక టీఎన్జీవోస్ సంఘ భవనంలో ఈ మహాసభ ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కాటుకూరి మల్లేష్, సలహాదారు ఆరెల్లి మల్లేష్, రాష్ట్ర అధ్యక్షుడు కాదేపురం గంగన్న హాజరవుతారని పేర్కొన్నారు.

### జర్నలిస్టుల సమస్యలపై చర్చ

ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టులకు ఎదురవుతున్న వివిధ సమస్యలపై ఈ మహాసభలో సుదీర్ఘంగా చర్చిస్తామని వెంకటస్వామి తెలిపారు. ముఖ్యంగా అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు, బస్సు పాసులు, రైల్వే పాసులు, హెల్త్ కార్డులు మరియు ఇళ్ల స్థలాల మంజూరు వంటి డిమాండ్లపై తీర్మానాలు చేయనున్నట్లు వివరించారు. మహాసభ ముగిసిన అనంతరం జిల్లా కలెక్టర్, డీపీఆర్ఓలను కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేస్తామన్నారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులందరూ ఈ మహాసభకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం మహాసభకు సంబంధించిన కరపత్రాలను నాయకులు విడుదల చేశారు. ఈ సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఈరోల పురుషోత్తం, జర్నలిస్టులు కాంబ్లే సూర్యకాంత్, రాజు ముదిరాజ్, పోశెట్టి, మధుకర్, గంగాధర్, ఠాగూర్ రాజు సింగ్, సగం మోహన్ దాస్ తదితరులు పాల్గొన్నారు.



# కేజీబీవీ పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన

బజార్‌హత్నూర్, జూన్ 19, ప్రభాతవార్త:



అదనపు తరగతి గదుల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బజార్‌హత్నూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో (కేజీబీవీ) రూ. 42.12 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముఖ్య అతిథులుగా హాజరై ఈ పనులకు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ.. కేజీబీవీ పాఠశాలల్లో చదువుతున్న బాలికల అభ్యున్నతి కొరకు ప్రభుత్వాలు నిరంతరం కృషి చేస్తున్నాయన్నారు. విద్యార్థినులు కష్టపడి చదివి తల్లిదండ్రులతో పాటు నియోజకవర్గానికి కూడా మంచి పేరు తీసుకురావాలని సూచించారు. విద్యార్థినులకు కావాల్సిన అన్ని రకాల వసతులు కల్పించడానికి తాము సిద్ధంగా ఉన్నామని భరోసా ఇచ్చారు. ఈ అదనపు గదుల నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలతో, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, పీఏసీఎస్ చైర్మన్ మేకల వెంకన్న, బీజేపీ మండల అధ్యక్షుడు పోరెడ్డి శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ పరచ సాయన్న, స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# భూధార్ సర్వే పకడ్బందీగా చేపట్టాలి

## - ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేష్ కుమార్

నిర్మల్, జూన్ 19, ప్రభాతవార్త:



రాష్ట్రంలో భూధార్ సర్వేను అత్యంత పకడ్బందీగా నిర్వహించి, భూ సంబంధిత దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుండి జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ (వీసీ) ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వేకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందే పూర్తి చేసుకుని, సర్వేయర్లను పూర్తిస్థాయిలో భాగస్వామ్యం చేయాలని సూచించారు. దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలి: క్షేత్రస్థాయిలో పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని, అలాగే భూభారతి దరఖాస్తులను నిర్ణీత 60 రోజుల గడువులోగా పూర్తి చేసేలా తగిన చర్యలు చేపట్టాలని ప్రిన్సిపల్ సెక్రటరీ స్పష్టం చేశారు. భూ సంబంధిత సమస్యల పరిష్కారంలో ఎలాంటి జాప్యం ఉండకూడదని ఆయన ఉద్ఘాటించారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలి - కలెక్టర్ భవేశ్ మిశ్రా: నిర్మల్ కలెక్టరేట్ సమావేశ మందిరం నుండి జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. వీసీ ముగిసిన అనంతరం ఆయన స్థానిక అధికారులతో మాట్లాడుతూ.. జిల్లాలో భూధార్ సర్వే విజయవంతంగా నిర్వహించడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సాదాబైనామా, భూభారతి దరఖాస్తుల పరిశీలన, పరిష్కారంలో ఆలస్యానికి తావు లేకుండా వేగంగా పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, డీఆర్ఓ రాథోడ్ రమేష్, ఏడీ ల్యాండ్ సర్వేయర్ నరసింహమూర్తి, ఇతర రెవెన్యూ అధికారులు, సర్వే విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

# వర్షాకాలం వరదలపై ఎన్డీఆర్ఎఫ్ అప్రమత్తంగా ఉండాలి

## - నిర్మల్ కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్, జూన్ 19, ప్రభాతవార్త:



వర్షాకాలంలో ఆకస్మిక వరదలు సంభవిస్తే ప్రజలను సురక్షితంగా ఉంచేందుకు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సర్వసన్నద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సూచించారు. శుక్రవారం జిల్లాకు వచ్చిన ఎన్డీఆర్ఎఫ్ బృంద సభ్యులు కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వర్షాకాలంలో భారీ వర్షాల వల్ల వరదలు వచ్చి లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడితే, తక్షణ సహాయక చర్యలు చేపట్టేందుకు ఎన్డీఆర్ఎఫ్ సిద్ధంగా ఉండాలన్నారు. విపత్కర పరిస్థితుల్లో ప్రజల ప్రాణాలను, ఆస్తులను కాపాడటంలో ఎన్డీఆర్ఎఫ్ పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు.

### అన్ని వసతులు కల్పిస్తాం..

జిల్లాకు వచ్చిన ఎన్డీఆర్ఎఫ్ బృందానికి అవసరమైన అన్ని రకాల వసతులను కల్పిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. వర్షాకాలం ముగిసే వరకు నిరంతరం అప్రమత్తంగా ఉండి, ఏ చిన్న విపత్తు ఎదురైనా తక్షణమే స్పందించి రంగంలోకి దిగాలని ఆదేశించారు. జిల్లా యంత్రాంగంతో పూర్తి సమన్వయం కలిగి ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, డీఆర్ఓ రాథోడ్ రమేష్, ఆర్డీఓ దేవిదాస్, ఎన్డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ జీడీ ముఖేష్ కుమార్, ఇతర అధికారులు, బృంద సభ్యులు పాల్గొన్నారు.